RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | సంపుటి : 3, సంచిక : 104 | గురువారం మార్చి 13, 2025 | పేజీలు : 4 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ..
నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379






# సమాజమా.. సిగ్గుపడు!

**కూతురు పాలిట కన్న తండ్రి కామాంధుడయ్యాడు..!**

**వేద న్యూస్, డెస్క్:**

***ఆడపిల్లకు రక్షణ కరువైంది. ఇంటి బయటే కాదు ఇంట్లోనూ భద్రత లేదు. కూతురిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్నతండ్రులు, అండగా ఉండాల్సిన తోడబుట్టిన సోదరులు కామాంధుల్లా మారుతున్నారు. అత్యాచారాలకు ఒడిగడుతున్నారు. అభంశుభం తెలియని చిన్నారులను లైంగికంగా వేధిస్తున్నారు.***

అవని ఆమె.. ఆకాశంలో సగం ఆమె.. శక్తి ఆమె.. యుక్తి ఆమె.. సృష్టికి మూలం ఆమె.. సృష్టి మనుగడకు కీలకమూ ఆమే.. సమాజంలోని విలువలు మరిచిన కొందరు మృగాళ్ల చేతిలో బలవుతోందీ ఆమే.. కొంత మంది ఆమేను ఆటబొమ్మగానే చూస్తున్నారు. అఘాయిత్యాలకు పాల్పడుతూనే ఉన్నారు. మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుని రోజులు కూడా కాలేదు. అంతలోనే ఆమెపైన అఘాయిత్యాలు షరామామూలే అన్నట్టుగా జరుగుతోండటం గమనార్హం.



ఆధునిక యుగంలోనూ ఆడపిల్లలను భారంగానే చూస్తున్నారు. పుట్టేది ఆడపిల్ల అని తెలియగానే కొందరు గర్భంలోనే ఊపిరి తీసేస్తున్నారు. మరికొందరు కన్నకూతుళ్లను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రులే వారి పాలిట కీచకులుగా మారుతున్నారు. తమ కామవాంఛకు వావివరసలు మరిచి పశువుల్లా ప్రవర్తిస్తున్నారు. దేశవ్యాప్తంగా రోజూ ఇలాంటి కేసులు అనేకం వెలుగు చూస్తున్నాయి. తాజాగా రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి (45) మెకానిక్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి 17 ఏళ్ల కిందట వివాహం కాగా ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. దంపతుల మధ్య విభేదాలు రావడంతో ఎనిమిదేళ్ల కిందట పిల్లలను తీసుకుని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. పదిహేనేళ్ల పెద్ద కుమార్తె మాత్రం మూడేళ్లుగా తండ్రి వద్దకు వచ్చి ఉంటోంది. ఈ బాలిక నగరంలోని ఓ పాఠశాలలో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతోంది. మంగళవారం పాఠశాలకు వచ్చిన బాలిక నిరుత్సాహంగా ఉండడాన్ని ఉపాధ్యాయురాలు గమనించారు. బాలికను ఓదార్చుతూ మాట్లాడితే తండ్రి గత కొద్ది రోజులుగా తనపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు చెప్పి కన్నీరు

మిగతా 4వ పేజీలో..



## దాత ఔదార్యంతో ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ

**భార్య పేరు మీదగా మూడు లక్షల ఇరవై ఒక్కవేల రూపాయలు వితరణ**

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మండలం లోని చిల్లాపురం గ్రామం ప్రాథమిక పాఠశాలలో దాత లక్ష్మీనారాయణ వారి యొక్క సతీమణి స్వర్గీయ సత్యకళ జ్ఞాపకార్థం, వారి కుమారులు మురళీకృష్ణ మరియు శ్రీధర్ లచే మూడు లక్షల ఇరవై ఒక్క వెయ్యి రూపాయలు ఇప్పించడం జరిగింది. వీటితో చిల్లాపురం పాఠశాలను, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ క్లాస్ రూమ్, ఆర్వో వాటర్ ప్లాంట్ వంటి సదుపాయాలు కల్పించడం జరిగింది. ఈ విధంగా ఇన్ని లక్షల రూపాయలను పేద విద్యార్థుల కోసం అందజేయడం పట్ల, పాఠశాల యాజమాన్యం, మరియు గ్రామ ప్రజలు అందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.


ఈ సందర్భంగా కంచనపల్లి లక్ష్మీనారాయణను పాఠశాల యాజమాన్యం తరఫున సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ వాసి మహబూబ్ నగర్ డి.ఎస్.పి పులిజాల వెంకటేశ్వర్లు,మండల విద్యాధికారి (ఎంఈఓ) బాలునాయక్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కందుల వెంకట్ రెడ్డి, ఏ ఏ పి చైర్మన్ మౌనిక, పాఠశాల పూర్వదాతలు సాతునూరి వెంకటేశ్వర్లు, అనుముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రేణు బాబు, లక్ష్మీనారాయణ, మచ్చలు శ్రీనివాస్, మోదాల శేఖర్, శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు పెద్ద శ్రీనివాస్ రాజు, అంబటి శ్రీనివాస్, ఆశాలత, పావని తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధి, ప్రగతి వైపు అడుగులు వేస్తుంది

- ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్
- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రజల కలల సాకారమే లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశ పెడుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. ప్రజలే కేంద్రంగా రాష్ట్రంలో పాలన సాగుతోందన్న గవర్నర్ అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. తెలంగాణ కేవలం పురోగమించడమే కాకుండా రూపాంతరం చెందుతున్నదన్న జిష్ణుదేవ్ వర్మ.. సమ్మిళితత్వం, స్వయం సమృద్ధి, సాహసోపేత సంస్కరణలు, నిర్ణయాత్మక నాయకత్వంతో సుపరిపాలన సాకారమవుతోందని స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించారు. అభివృద్ధి, ప్రగతి వైపు అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర అభివృద్దే మా ప్రభుత్వ ధ్యేయం, దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి అవుతోంది. వరి రైతులకు రూ. 500 బోనస్ ఇస్తున్నాం. మహాలక్ష్మి స్కీమ్ కింద ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. అంతర్జాతీయ క్రీడా యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేశాం అని గవర్నర్ తన ప్రసంగంలో చదివి వినిపించారు. రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టాం. పేదలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రుణమాఫీ కోసం ఏకంగా రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశాం. రూ. 500కే గ్యాస్ అందజేస్తున్నాం అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాం. బీసీల రిజర్వేషన్ల



కోసం కుల గణనను నిర్వహించాం. ఎస్సీ వర్గీకరణపై కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ఆ నివేదికకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఉద్యోగాల భర్తీ విషయంలో పారదర్శకతను పాటిస్తున్నాం. ఇందుకోసం టీజీపీఎస్సీని బలోపేతం చేశాం.ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ప్రారంభించింది. శ్రీశైలం- సాగర్ హైవే మధ్యలో ఉన్న ప్రాంతాన్ని ఇందులో చేర్చాం. ప్రపంచస్థాయి మౌలిక వసతులను ఏర్పాటు చేయబోతున్నాం. మెట్రో రైలు సౌకర్యం కూడా రాబోతుంది అని గవర్నర్ తెలిపారు. జయ జయహే జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నాం. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నాం అని గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద కూలీలకు రూ. 12 వేలు అందిస్తున్నాం. ఏడాదిలోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. రైతు భరోసా ద్వారా ఎకరానికి ఏడాదికి రూ. 12 వేలు ఇచ్చాం. నీటి వాటా కోసం కృష్ణా ట్రిబ్యునల్ లో వాదనలు వినిపించాం. దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి అని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.



## ప్రతి పదం అబద్ధం.. ప్రతి మాట అసత్యం..!

- కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం
- గవర్నర్ ప్రసంగంపై అసహనం వ్యక్తం చేసిన కేటీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని గవర్నర్ నోటి వెంట ప్రభుత్వం అబద్ధాలు చెప్పించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ముగిసిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ నోటి వెంట అబద్ధాలు చెప్పించినందుకు తాము బాధపడుతున్నామని అన్నారు. గవర్నర్ స్థాయిని దిగజార్చి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని చాటుకుందని ఇది గవర్నర్ కు అవమానమని మండిపడ్డారు. ఈ విషయాన్ని గవర్నర్ కూడా గుర్తించాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని గవర్నర్ మందలిస్తారేమోనని అనుకున్నామని తెలిపారు. చావు డప్పు కొట్టాల్సిన చోట డీజే తరహాలో డప్పు కొట్టారని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు స్వాంతన చేకూర్చే ప్రకటన ఉంటుందనుకున్నామని, లక్షల ఎకరాల్లో పంట ఎండుతుంటే కనీసం పట్టించుకునే మంత్రే లేరని ధ్వజమెత్తారు. ప్రభుత్వం రూ. 1.60 లక్షల కోట్లు అప్పు చేసి కూడా కొత్త పథకం అమలు చేయలేదని దుయ్యబట్టారు. దావోస్ లో రూ. 1.79 లక్షల కోట్ల పెట్టుబడులు అన్నారు. దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కమీషన్లు, ట్యాక్స్‌లు తట్టుకోలేక నిర్మాణ రంగం కుదేలైందన్నారు. గవర్నర్ ప్రసంగంలో ప్రతి పదం అబద్ధం.. ప్రతి మాట అసత్యం. కులగణన పేరుతో బీసీల సంఖ్యను తగ్గించారని మండిపడ్డారు.

## శాయంపేట కేజీబీవీ సందర్శించిన డీఈవో

**వేద న్యూస్, శాయంపేట :**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాల యంను జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి బుధవారం సందర్శించారు. 10వ తరగతి క్లాస్ ప్రీ ఫైనల్ పరీక్షలను, విద్యార్థుల సామర్థ్యాన్ని, తరగతి గదుల నిర్వాహణను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థుల ను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసి మంచి ఫలితాలు సాధించాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు అధికారులు పాల్గొన్నారు.



## మరో మూడు కొత్త మున్సిపాలిటీలు..

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో మరో మూడు కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు కాంగ్రెస్ సర్కార్ చర్యలు చేపట్టింది. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలోని చింతలపల్లి, ఎల్లంపేట, అలియాబాద్‌లను మున్సిపాలిటీలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం పొందినట్లు తెలిసింది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశ పెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. బిల్లు అమోదం పొందితే మేడ్చల్ జిల్లా పూర్తిగా పట్టణ ప్రాంతంగా మారిపోతుంది.

# హోళి నుంచి అమరావతి పనులు

అమరావతి : అమరావతి రాజధానినిర్మాణానికి సంబంధించి కీలక పరిణామం. పనుల ప్రారంభానికి సంబంధించి ప్రభుత్వం ముహూర్తం సిద్ధం చేసింది. ఈనెల 12 నుంచి 15 మధ్య రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఖచ్చితమైన ముహూర్తాన్ని ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. దీంతో అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరిగే పరిస్థితి కనిపిస్తోంది. గత అనుభవాల దృష్ట్యా మూడు సంవత్సరాల్లో పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించింది. అన్ని విధాలా అమరావతి రాజధానిని అందుబాటులోకి తేవాలన్నది సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్రణాళిక.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధాని విషయంలో కదలిక వచ్చింది. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి రాజధాని ఎంపిక జరిగింది. అందరి ఆమోదంతో ఏకాభిప్రాయంతో అమరావతిని ఎంపిక చేశారు. రాజధాని నిర్మాణ పనులు కూడా ప్రారంభం అయ్యాయి. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. అమరావతి రాజధాని స్థానంలో మూడు రాజధానుల అంశం తెరపైకి వచ్చింది. అయితే మూడు రాజధానుల నిర్మాణం పూర్తి చేయడంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయింది. ఇప్పుడు మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి రాజధానిని శరవేగంగా పూర్తి చేయాలని సంకల్పంగా పెట్టుకుంది.కేంద్ర ప్రభుత్వం సైతం అమరావతి రాజధాని నిర్మాణానికి అన్ని విధాల సహకారం అందిస్తోంది. ఇప్పటికే 15 వేల కోట్ల రూపాయల సాయం ప్రకటించింది. మరోవైపు వివిధ సంస్థల ద్వారా పెట్టుబడి సేకరణ కూడా జరిగింది. అమరావతి రాజధాని నిర్మాణానికి దాదాపు 40 వేల కోట్ల రూపాయలు సమీకరించింది కూటమి ప్రభుత్వం. మరోవైపు వివిధ సంస్థలు సైతం తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయి. ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం.. ఇంకోవైపు ప్రైవేటు సంస్థల భవనాల నిర్మాణం కూడా ప్రారంభం కానుంది. గత అనుభవాల దృష్ట్యా 2028 నాటికి అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని బలమైన సంకల్పంతో ముందుకు అడుగు వేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం.2029 లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ సమయానికి రాజధాని నిర్మాణం పూర్తి చేయాలన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యం. తద్వారా రాజధాని నిర్మాణం పూర్తి చేశామని.. తమను ఆశీర్వదించాలని ప్రజల వద్దకు వెళ్లేందుకు కూటమి ఆలోచనగా తెలుస్తోంది. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అమరావతి రాజధాని నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. తమ సొంత శాఖ కంటే రాజధాని నిర్మాణానికి ఆయన అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. విలువైన సమయాన్ని కేటాయిస్తున్నారు.

2029 కోసం ప్రణాళిక...

ఏపీ సీఎం చంద్రబాబు మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే ప్రజల్లోకి బలంగా వెళ్లాలని నిర్ణయించారు. అయితే అది బిజెపి, జనసేన లతో స్ట్రాంగ్ బంధానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ జపం పఠిస్తున్నారు. దీనికి కారణాలు లేకపోలేదు.



చంద్రబాబు ఎక్కువగా సేఫ్ జోన్ చూస్తుంటారు. సేఫ్ గేమ్ ఆడేందుకు ప్రయత్నిస్తారు. ఎన్నికల సమయంలో లాభనష్టాలు బేరీజు వేసుకొని అడుగులు వేస్తుంటారు. అందుకే 2024లో హిట్ అయిన కాంబినేషన్ కొనసాగాలని కోరుకుంటున్నారు. మూడు పార్టీల కలయిక సూపర్ హిట్ కావడంతోనే చంద్రబాబు.. 2029 లోను ఇదే రిపీట్ చేయాలని భావిస్తున్నారు.2018లో ఎన్డీఏనుంచి బయటకు వచ్చిన చంద్రబాబు మూల్యం చెల్లించుకున్నారు. మోడీ ఆగ్రహానికి గురై అధికారానికి దూరమయ్యారు. గత ఐదేళ్లలో రాజకీయంగా ఇబ్బంది పడ్డారు. అందుకే మళ్ళీ అలాంటి తప్పు చేయకూడదని భావిస్తున్నారు. అందుకే జాతీయస్థాయిలో ప్రధాని మోదీని అనుసరిస్తున్నారు. వాస్తవానికి మోడీ చంద్రబాబు కంటే జూనియర్. ఈ విషయాన్ని చంద్రబాబు చాలా సార్లు చెప్పుకొచ్చారు కూడా. అయితే ఇప్పుడున్న రాష్ట్ర రాజకీయ సంక్లిష్ట పరిస్థితి దృష్ట్యా కేంద్రంతో ముందుకెళ్లాల్సిన అనివార్య పరిస్థితి చంద్రబాబుకి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వాన్ని ఏ విషయంలో కూడా చంద్రబాబు ప్రశ్నించడం లేదు. వీలైనంతవరకు విధేయత ప్రదర్శిస్తూ వస్తున్నారు. హిందీని రాష్ట్రాల మీద రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తుండడం పై విపక్షాలు ఆగ్రహంతో ఉన్నాయి. మరోవైపు జనాభా ప్రాతిపదికన డీ లిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ఈ విషయంలో నోరు మెదపడం లేదు.ఏపీలో పవన్ కళ్యాణ్ విషయంలో చంద్రబాబు ఎన్నడూ చూపని రాజకీయ ఉదారత చూపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ కు ఏపీ డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారు. ఏపీలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన ఫోటో పెట్టించారు. నాగబాబును ఎమ్మెల్సీ చేసి మంత్రిగా అవకాశం ఇస్తున్నారు. అయితే ఇక్కడే ఒక రకమైన పరిస్థితి కనిపిస్తోంది. కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ను ప్రాధాన్యం ఇస్తే సరిపోతుందా.. తమ పరిస్థితి ఏంటని టిడిపి శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. ముఖ్యంగా 21 మంది ఎమ్మెల్యేలు ఉన్న జనసేనకు నాలుగు మంత్రి పదవులు ఇస్తే.. ఏంటనేది ఇప్పుడు ప్రశ్న. ఇంకోవైపు బిజెపి సైతం తమకు మరో మంత్రి పదవి కావాలని కోరుకుంటుంది. అయితే చంద్రబాబుకు ఇవేవీ కనిపించడం లేదు.. ఇవేవీ వినిపించడం లేదు. ఆయన దృష్టి అంత 2029 ఎన్నికలపైనే ఉంది.

# ఇంట గెలవని... జగన్..రచ్చ గెలుస్తాడా

విజయవాడ : ఇంట గెలచి రచ్చ గెలవమన్నారు పెద్దలు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మాత్రం ఇంట గెలవలేకపోతున్నారు. ఆయన కుటుంబసభ్యులే దూరమయ్యారు. రాజకీయాల్లో జగన్ కు ఇది చాలా ఇబ్బంది కరమైన పరిణామం. ఎందుకంటే .. కుటుంబ సభ్యుల మద్దతు లేని జగన్ ఇక జనం సపోర్టు ఎలా పొందుతారన్న ప్రశ్నకు వారి వద్ద నుంచి సమాధానం బహుశా రాకపోవచ్చు. 2019 ఎన్నికలకు ముందు వరకూ ఒక్కటిగా ఉండే వైఎస్ కుటుంబం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విడపోయారు. కారణాలు బయటకు ఏవైనా చెప్పొచ్చు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవచ్చు. కానీ సామాన్య ప్రజలకు మాత్రం వైఎస్ కుటుంబంలోని విభేదాలే బయటకు కనిపిస్తాయి. గత ఎన్నికలలో వైసీపీ ఘోర ఓటమికి ఇది కూడా కారణమని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. వైఎస్ జగన్ సొంత పార్టీ పెట్టుకుని తాను రాజకీయంగా ఎదిగి ఉండవచ్చు. కానీ 2014కు ముందు నుంచే జగన్ కు తల్లి విజయమ్మ, సోదరి వైఎస్ షర్మిల మద్దతు రాజకీయంగా పుష్కలంగా లభించేది. ఇద్దరూ అలుపెరగకుండా జగన్ విజయం కోసం పనిచేశారు.షర్మిల అయితే జగన్ జైలులో ఉన్న సమయంలో సుదీర్ఘ పాదయాత్ర చేసి సోదరుడికి అండగా నిలిచారు. విజయమ్మ కూడా రేయింబవళ్లూ జగన్ ను గెలిపించాలంటూ ఊరూ వాడ తిరిగి ప్రచారాన్ని నిర్వహించారు. ఫలితంగా 2019 ఎన్నికల్లో జగన్ అధికారంలోకి రాగలిగారు. వంద శాతం వీరి వల్లనే కాకపోయినా ముప్ఫయి శాతం మాత్రం వైసీపీ విజయంలో వీరిద్దరి పాత్ర ఉందన్నది ఎవరూ కాదనలేరు అదే 2024 ఎన్నికలకు వచ్చేసరికి జగన్ కు అంతా దూరమయ్యారు. తల్లి విజయమ్మ కూడా కుమారుడికి మద్దతుగా నిలవడం లేదు. అప్పుడప్పుడూ ఇడుపులపాయకు వచ్చినప్పుడు మినహా జగన్ ను ఆమె కలవడం లేదు. జగన్ వెళ్లి ఆమెను కలసి మాట్లాడింది. దీంతో పాటు ఆస్తుల తగాదాలు ఇప్పుడు మరింత దూరాన్ని పెంచాయి. న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండంతో కుటుంబ సభ్యుల రచ్చ రాజకీయంగా జగన్ కే ఎక్కువ నష్టం చేకూరుస్తుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. వైఎస్ షర్మిలకు పోయేదేమీ లేదు. ఆమె అధికారంలోకి వస్తానని ఊహించుకోవడం లేదు. అలాగే కాంగ్రెస్ పార్టీ పవర్ లోకి వచ్చే అవకాశం లేదు. దీంతో ఏదైనా నష్టం జరిగితే అది జగన్ కే జరుగుతుంది. ప్రతి కుటుంబంలో రక్త సంబంధీకుల మధ్య వైరుధ్యాలు,ఆస్తి తగాదాలున్నప్పటికీ రాజకీయాల్లో మాత్రం వాటికి దూరంగా ఉండాలి. ప్రజాజీవితంలో ఉన్నప్పుడు జనం వాటిని గమనిస్తారు. సొంత తల్లిని, చెల్లిని జగన్ మోసం చేస్తే ఇక జనాన్ని ఎందుకు మోసం చేయరంటూ గత ఎన్నికల నుంచి టీడీపీ, జనసేన నేతలు పెద్దయెత్తు చేసిన విమర్శలు జనంలోకి బాగా చొచ్చుకు వెళ్లాయి. కానీ జగన్ మాత్రం పట్టించుకోలేదు. దీనికితోడు వైఎస్ వివేకాహత్య కూడా జగన్ గెలుపుకు ఆటంకంగా మారింది. ఇటు కుటుంబంలో ఎవరి మద్దతు లేకపోవడంతో పాటు పైగా విమర్శలు కూడా వారి నుంచి జోరుగా వస్తుండటం జగన్ కు రాజకీయంగా ఇబ్బందులే తప్ప భవిష్యత్ లోనూ ఇవి ఏమాత్రం సరికాదన్న కామెంట్స్ వైసీపీ నేతలే అంటుండటం విశేషం.

# అనుమానస్పద మరణాలు

కడప : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు సినిమా క్రైమ్ను తలపిస్తోంది. ఈ కేసుకు సంబంధించిన కీలక సాక్షులు, అనుమానితులు ఒకరి తర్వాత ఒకరుగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటి వరకు ఒకరిద్దరు కాదు, ఏకంగా ఆరుగురు మరణించారు. వీరందరి మరణాలు ఒకే రీతిన ఉండడం, అవన్నీ సహజ మరణాలుగానే రిపోర్టు అవుతుండడం అనుమానాలకు తావిస్తోంది.తాజాగా ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న అనుమానాస్పద స్థితిలో మరణించడం, తన తండ్రికి అందించిన వైద్య చికిత్సపై అనుమానాలు ఉన్నాయని రంగన్న కొడుకు కాంతారావు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ మరణాల వెనక సందేహాలు మరింతగా బలపడుతున్నాయి. వివేకా హత్య కేసు నిందితులే ఈ చావుల వెనక ఉన్నారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో, ఈ మరణాలన్నింటిపైనా సమగ్ర దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆయన ఓ మాజీ ఎంపీ.. అంతే కాదు.. ఓ మాజీ సీఎంకు సోదరుడు.. ఆ జిల్లాలో అతిపెద్ద రాజకీయ కుటుంబానికి ఆయన ముఖ్యనేత. అలాంటి ఆయన తన సొంతింట్లో క్రూరంగా హత్యకు గురయ్యారు. అనుమానితులున్నారు... ఆధారాలున్నాయి. సాక్ష్యాలూ ఉన్నాయి. ఆరేళ్లు అయినా ఆ కేసుకు అతీగతీ లేదు. అంతలోనే ఆ కేసుతో సంబంధం ఉన్న ఒక్కొక్కరూ చనిపోతున్నారు. అందుకే అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. కడప జిల్లాలోని పలుకుబడి కలిగిన నేత వైఎస్ వివేకానంద రెడ్డి హత్య గురించే ఇదంతా అని మీకు ఇప్పటికే అర్థం అయి ఉంటుంది. చాలా కాలంగా రాజకీయ నాయకులు, మీడియా కూడా బాగా మాట్లాడి మాట్లాడి వదిలేసిన ఈ కేసు గురించి మళ్లీ చెప్పుకోవడానికి కారణం.. ఈ కేసులో ప్రధాన సాక్షి వాచ్‌మెన్ రంగయ్య మరణం. చూడటానికి సహజమరణంలానే కనిపిస్తోంది కానీ ఈ కేసులో ఇంతకు ముందు జరిగిన సంఘటనలు... కేసులోని సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోవడంతో ప్రతీ విషయాన్ని అనుమానించాల్సి వస్తోంది. ఇప్పటి వరకూ ఇలా ఆరుగురు చనిపోయారు. జనంలో అనుమానాలుండటమే కాదు.. ఇప్పుడు పోలీసుశాఖ కూడా ఈ గొలుసుకట్టు మరణాల తీగను పట్టుకుంది. మరి డొంక కదులుతుందో లేదో చూడాలి. అసలు ఈ కేసుపై ఎందుకు అనుమానాలంటే.. అప్పట్లో జరిగిన వ్యవహారాలు అలాంటివి మరి. ఆరేళ్ల కిందట వివేకా మర్డర్ జరిగిన దగ్గర నుంచి.. నిన్న రంగయ్య చనిపోయిన వరకూ అనేక మలుపులు తిరిగింది ఈ కేసు. ఈ హత్యలో ఉన్న కోణాలే కాదు.. ఆరేళ్ల కిందట రాష్ట్ర రాజకీయ రంగాన్నే మలుపతిప్పింది కూడా. అసలు ఈ మొత్తం వ్యవహారంలో ప్రతీ అడుగులోనూ ఒక్కో ట్విస్ట్ ఉంది. వరుసగా ఏం జరుగుతూ వచ్చిందో ఒక్కసారి గుర్తు చేసుకుందాం. 2019, మార్చ్ 15 తెల్లవారుజామున రక్తపుమడుగులో పడి ఉన్న వివేకానందరెడ్డిని గుర్తించారు. ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చి రాత్రి ఇంట్లో పడుకున్న ఆయన్ను లేపేందుకు ఆయన పీఏ కృష్ణారెడ్డి తెల్లవారుజామున ఇంటికి వెళ్లారు. ఎంతకూ నిద్రలేవకపోవడంతో వెనుక నుంచి తలుపులు తెరిచి వివేకా రక్తపు మడుగులో పడిపోయినట్లు గుర్తించారు.

నారాయణయాదవ్, జగన్ వాహన డ్రైవర్, సాక్షి :

వివేకా అంత్యక్రియలకు హాజరయ్యేందుకు జగన్, భారతి రెడ్డి హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా పులివెందులకు వచ్చారు. అప్పుడు వారి వాహనాన్ని నడిపిన నారాయణ 2019 డిసెంబరులో చనిపోయారు. అనారోగ్యంతో మరణించాడని ప్రచారం జరిగింది. రాష్ట్ర పోలీసుల సిట్ ఎంక్వైరీ వేగం అందుకుంటున్న సమయంలో నారాయణ మరణించడం అనుమానాలకు తావిచ్చింది.హైదరాబాద్ నుంచి పులివెందుల వరకు సాగిన ప్రయాణంలో జగన్, భారతి, అవినాష్‌రెడ్డి తదితరుల మధ్య వివేకా మరణానికి సంబంధించిన ఫోన్ సంభాషణలు జరిగాయని, కారు నడుపుతున్న నారాయణ యాదవ్ అవి విన్నారనే కంప్లైంట్స్ ఉన్నాయి. దీంతో ఆయన్ను కీలక సాక్షిగా విచారించాల్సి ఉంది. అయితే, విచారణకు పిలవకముందే అతను మరణించడం అనేక అనుమానాలకు తావిచ్చింది.

బి.రంగన్న, వాచ్‌మన్, హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి

వాచ్‌మన్ బి.రంగన్న వివేకా ఇంటి వద్ద కాపలా ఉండేవాడు. ఆ రోజు వివేకా హత్యలో పాల్గొన్న వారిని ఆయన ప్రత్యక్షంగా చూశారు. అంతేకాదు షేక్ దస్తగిరి, ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకరరెడ్డి, సునీల్ యాదవ్ ఈ హత్య చేసినట్టు మేజిస్ట్రేట్ ముందు, సీబీఐ ముందు వాంగ్మూలం కూడా ఇచ్చారు. రంగన్న వాంగ్మూలం తర్వాతనే అవినాష్‌రెడ్డి, శివశంకరరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరుల ప్రమేయం వెలుగు చూసింది. ఈ హత్య గురించి బయటకు చెబితే చంపేస్తానంటూ గంగిరెడ్డి తనను బెదిరించారని కూడా రంగన్న వాంగ్మూలం ఇచ్చారు.ఆ విధంగా హత్య కేసులో అత్యంత కీలకంగా ఉన్న సాక్షి రంగన్న 2 రోజుల క్రితం అనుమానాస్పదంగా మరణించారు. తొలుత అస్వస్థతకు గురయ్యారని పులివెందుల దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. తన తండ్రికి గతేడాది కాలికి గాయమైందని, పులివెందుల, కడప, హైదరాబాద్, తిరుపతి ఇలా ఎన్ని ఆసుపత్రులు తిప్పినా తగ్గలేదు. తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స వివరాలు అడిగితే పోలీసులు ఇవ్వలేదు. ఆ ట్రీట్మెంట్ పైన తమకు అనుమానాలున్నాయని రంగన్న భార్య, కొడుకు కాంతారావు ఆరోపిస్తున్నారు.

కల్లూరి గంగాధర్‌రెడ్డి, కీలక సాక్షి :

హత్య కేసులో ముఖ్యమైన సాక్షుల్లో కల్లూరు గంగాధర్‌రెడ్డి (40) ఒకరు. ఆయన 2022 జూన్‌లో చనిపోయారు. అనారోగ్యంతో మరణించారని అప్పట్లో ప్రచారం జరిగింది. హత్య కేసు దర్యాప్తు కోసం అఃఐ బృందాలు పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయం, వైఎస్ అవినాష్‌రెడ్డి ఇళ్లు, వివేకానందరెడ్డి నివాసం, ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి పరిసరాల్లో సోదాలు నిర్వహించారు. ఇది జరిగిన వెంటనే గంగాధర్‌రెడ్డి సందేహాస్పద స్థితిలో మరణించారు.వివేకాను హత్యను తనపై వేసుకుంటే రూ.10 కోట్లు ఇస్తారని దేవిరెడ్డి శివశంకరరెడ్డి తనతో అన్నారని, ఆ ఆఫర్ను తాను తిరస్కరించానని గంగాధర్‌రెడ్డి సీబీఐకి చెప్పారు. ఆ తర్వాత మాట మార్చి సీబీఐ బలవంతం చేస్తేనే అలా చెప్పానని అన్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకే గంగాధర్‌రెడ్డి అనుమానాస్పదంగా మరణించారు.

కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి, అనుమానితుడు :

వైఎస్సార్ జిల్లా కసనూరు గ్రామానికి చెందిన కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి (57) వివేకా హత్య కేసులో అనుమానితుడు. ఈ హత్య ప్లాన్ గురించి అతనికి, అతని బావ పరమేశ్వరరెడ్డికి ముందే తెలుసు అనే సందేహాలు ఉన్నాయి. పరమేశ్వరరెడ్డి నార్కో టెస్టుకు హాజరై తిరిగొచ్చిన కొన్ని రోజుల్లోనే శ్రీనివాసులరెడ్డి చనిపోయారు. రాష్ట్ర పోలీసు సిట్ ఈ కేసును విచారిస్తున్న సమయంలో 2019 సెప్టెంబరులో మరణించారు. అయితే, తన మరణానికి సిట్‌లోని ఇన్‌స్పెక్టర్ కారణమంటూ అప్పటి ముఖ్యమంత్రి జగన్ కు ఆయన రాశారని చెప్పిన రెండు లేఖల్ని పోలీసులు శ్రీనివాసుల రెడ్డి కుటుంబసభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ లేఖలు ఆయన రాయలేదనే సందేహాలున్నాయి. శ్రీనివాసులరెడ్డి శరీరంలో లివర్, కిడ్నీ మధ్య భాగంలో రక్తపు ఆనవాళ్లు ఉన్నాయని ఫోరెన్సిక్ రిపోర్టు తేల్చింది. అవేంటో తేల్చకుండానే పోలీసులు కేసు మూసేశారు.

డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి, సాక్షి :

వివేకా కేసులోని కీలకమైన సాక్షుల్లో వైఎస్ అభిషేక్‌రెడ్డి (36) ఒకరు. వివేకా మరణించినట్టు దేవిరెడ్డి శివశంకరరెడ్డి తనకు ఫోన్ చేశారని, వెళ్లి చూస్తే రక్తపు, వివేకా నుదుటిపై గాయాలు కనిపించాయని, ఇది హత్యగానే భావించానని 2021 ఆగస్టులో సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారు. అవినాష్‌రెడ్డి, శివశంకరరెడ్డి, ఎర్ర గంగిరెడ్డి దీన్ని గుండెపోటుగా చిత్రీకరించారని ప్రస్తావించారు. అభిషేక్‌రెడ్డి ఒక వైద్యుడు, పైగా యువకుడు. ఆయన కూడా ఈ వాంగ్మూలం ఇచ్చిన కొన్నాళ్ల తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఈ ఏడాది జనవరి నెలలో చనిపోయారు. ఈ మరణంపై చాలా అనుమానాలున్నాయి.

ఈసీ గంగిరెడ్డి, వైఎస్ భారతి తండ్రి :

వైఎస్ భారతి తండ్రి, జగన్ సొంత మామైన ఈసీ గంగిరెడ్డి (73) 2020 అక్టోబరులో అనారోగ్యంతో మరణించారు. వివేకా హత్య గురించి ఆయనకు తెలుసనే సందేహాలు ఉన్నాయి. వివేకా మృతదేహానికి ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి సిబ్బందే కట్లు కట్టి, బ్యాండేజీలు వేశారు. నిందితులు గంగిరెడ్డి సదరు ఆసుపత్రికి వెళ్లి చేతులు కడుక్కున్నారనే ఫిర్యాదులు కూడా న్నాయి. ఆయన 2020 అక్టోబరు 3న మరణించారు. ఆయన మృతి కూడా అనుమానాస్పదంగా ఉంది.

# పోసాని స్టేషన్ టూర్..


కడప : వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేనా అధినేత పవన్ కళ్యాణ్ మీద తీవ్ర అభ్యంతర పదజాలంతో విమర్శలు గుప్పించిన పోసాని కృష్ణమురళీ.. పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఒక కేసులో అరెస్టై రిమాండా ముగిసిన వెంటనే.. మరో కేసులో అరెస్టుకు రంగం సిద్ధమవుతోంది. ఒక కేసులో బయటకు వచ్చే లోగానే.. అటునుంచి అటే మరో కేసులో విచారణ పేరుతో పోలీసులు పట్టుకుపోతున్నారు. ప్రశాంతంగా సినిమా పరిశ్రమలో ఉన్న పోసాని.. తన నోటికి పని చెప్పడంతో ఇప్పుడీ పరిస్థితి కొని తెచ్చు?కున్నారు అంటున్నారు.. ఆయన సన్నిహితులు. ఇన్నాళ్టికి కానీ, అసలు రాజకీయాలు అంటే ఎలా ఉంటాయి, వాటి ప్రభావం ఏ తీరుగా ఉంటాయో తెలిసొచ్చేలా చేస్తున్నారు. కాగా.. ఈ మధ్య కడపలోని మొబైల్ కోర్టు పోసానికి బెయిల్ మంజూరు చేసింది. అయినా.. ఆయన కోర్టులు, స్టేషన్ల చుట్టూనే తిరుగుతున్నారు. అందుకు కారణమేంటి. ఎన్నాళ్లు పోసాని కేసుల ఊబి నుంచి బయటపడే అవకాశాలు లేవు అనే చర్చ రాష్ట్రంలో తీవ్రంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే పోసానిపై రాష్ట్రంలో నమోదైన వివిధ కేసులు.. పోసాని బయటకు రాకపోవడాని కారణాల్ని తెలుసుకుందాం.ఆలోచనకు తోచిందే మాట, నోటికి వచ్చిందే విమర్శ అన్నట్లు వైసీపీ హయాంలో ప్రెస్మీట్లల్లో తీవ్రమైన అభ్యంతర, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమురళీపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాలో కేసులు నమోదవుతున్నాయి. వీటిలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం ఉపయోగించడం వంటి కారణాలతో నమోదైన కేసులే అధికం. ఏఏ జిల్లాల్లో కేసులు నమోదు చేశారు అంటే.. కడప జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లల్లో పోసాని కృష్ణ మురళీపై పోలీసు కేసు నమోదైంది. పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీసీ సెల్, ఎస్సీ సెల్ నేతలు ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు కేసు నమోదు చేశారు. తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. పోసాని పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు చేశారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు పోలీస్ స్టేషన్‌లోనూ ఇలాంటి కేసే నమోదైంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు చేశారు. ఇలాగే.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం పోలీస్ స్టేషన్లో, కృష్ణా జిల్లా గుడివాడ పోలీస్ స్టేషన్ పరిధిలో, అనంతపురం జిల్లాలో ఇలా..రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి చివరి నాటికిదాదాపు 50కి పైగా పోలీసు కేసులు నమోదైయ్యాయి. ఇవ్వన్నీ.. ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, మాటలపైనే నమోదైయ్యాయి.పోసానిపై నమోదైన కేసుల్లో చాలా వరకు భారతీయ న్యాయ స్మృతి (ఃఔె) 2023 లోని వివిధ సెక్షన్లు కింద కేసులు పెట్టారు. వాటిలో.. వ్యక్తిగత అవమానం చేయడం(సెక్షన్ 323), ఇతరుల గౌరవాన్ని హననం చేయడం లేదా తప్పుడు ఆరోపణలు చేయడం(సెక్షన్ 499), ఉద్దేశపూర్వకంగా అవమానించడం ద్వారా శాంతి భంగం చేయడానికి ప్రేరేపించడం(సెక్షన్ 504), ఇతరులను బెదిరించడం లేదా హాని చేయాలని బెదిరించడం( సెక్షన్ 506), గోప్యంగా లేదా గుర్తు తెలియని విధంగా బెదిరింపులు పంపించడం(సెక్షన్ 507), మహిళల వినయం అవమానపరిచే చర్యలు(సెక్షన్ 509) వంటి సెక్షన్లను జోడించారు.సినీ నటుడు, వైఎస్ఆర్సీపీ నాయకుడు పోసాని కృష్ణమురళీపై ఏపీలోని అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో తొలిసారిగా 2025 ఫిబ్రవరి 24న అరెస్టు చేశారు. హైదరాబాద్ లోని ఆయన నివాసంలో పోసానిని అరెస్టు చేసిన పోలీసులు.. రైల్వే కోడూరులో విచారించి, అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కోర్టులో హాజరుపరిచగా.. 14 రోజుల రిమాండ్ విధించడంతో.. రాజంపేట సబ్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఏపీ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పోలీసు కేసులు నమోదవుతూనే ఉన్నాయి.పోసానికి అన్నమయ్య జిల్లాలోని ఓబులాపురంలో నమోదైన కేసులో బెయిల్ మంజూరు అయ్యింది. కానీ.. రాష్ట్రంలోని మిగతా కేసుల్లో ఆయపై నమోదైన కేసుల కారణంగా.. ఇంకా విడుదల సాధ్యం కాలేదు. తాజాగా.. పోసాని కృష్ణ మురళీపై విజయవాడలోని ఓ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా.. కర్నూలు జిల్లా జైలు నుంచి పీడీ వారెంట్ పై విజయవాడకు తీసుకువచ్చారు.. భవానీ పురం పోలీసలు వైద్యపరీక్షల అనంతరం విజయవాడలోని సీఎంఎం కోర్టులో హాజరుపర్చగా.. ఈ నెల 20 వరకు పోసాని రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో సహా మంత్రులు, వారి కుటుంభ సభ్యులు, వారింట్లో వాళ్లను, మీడియా సంస్థలపై ఇష్టానుసారం.. అసభ్యకర పదజాలంతో దూషించారని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ.. జనసేన నేత శంకర్ ఫిర్యాదుతో విజయవాడలోని భవానీపురం పోలీసులు పోసానిని అరెస్టు చేశారు.తనపై అక్రమ కేసులు పెట్టారంటూ ఆరోపిస్తున్న పోసాని కృష్ణ మురళి.. ఒకే విధమైన కేసులు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పెట్టి.. తనను ఇష్టానుసారం తిప్పుతున్నారంటూ పోసాని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు గుండె జబ్బు ఉందని, పక్షవాతం లాంటి రుగ్మతలు వేధిస్తున్నాయని కోర్టులో న్యాయమూర్తి ముందు పోసాని వివరించారు. అలా.. ఒక చోట నుంచి మరోచోటకు పోసాని కృష్ణ మురళీ జైళ్లు తిరుగుతూనే ఉన్నారు. ఈ కేసులు ఎప్పుడు ముగుస్తాయి, ఎన్నటికి బయటపడతాడు అన్నది మాత్రం.. ఇంకా సస్పెన్స్ గానే ఉంది.

# వారసత్వ రాజకీయాలదే హవా..

విజయవాడ : రెండు తెలుగు రాష్ట్రాలను వారసత్వ రాజకీయాలే శాసిస్తున్నాయి. కుటుంబ రాజకీయాలే ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల్లోనే ఇది ఎక్కువగా ఉంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీకి ఇది కొద్దిగా దూరమయినప్పటికీ ప్రాంతీయ పార్టీలు మాత్రం వారసత్వ రాజకీయాలు అందిపుచ్చుకుంటున్నాయి. వారిదే హవా నడుస్తుంది. వారికే పార్టీ పగ్గాలయినా.. ప్రభుత్వ పదవులయినా.. పార్టీ జెండా మోసిన వారిని కాకుండా కుటుంబ సభ్యులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కానీ తప్పదు. వారు లేకుంటే నాయకత్వం లేదు. వారి వల్లనే పార్టీ నిర్మాణం దగ్గర నుంచి అవసరమైన అన్ని పనులు జరుగుతుండటంతో వారిని విస్మరించి, కాదని వేరే ఏమీ చేయలేని పరిస్థితి పార్టీ అధినేతలది తెలంగాణలో బీఆర్ఎస్ ఫక్తు కుటుంబ పార్టీగా ముద్ర పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన కుమారుడు కేటీఆర్ మంత్రిగా ఉన్నారు. మేనల్లుడు హరీశ్ రావు మంత్రిగా ఉన్నారు. కుమార్తె కల్వకుంట్ల కవిత రాజ్యసభ, పార్లమెంటు లేదంటే ఎమ్మెల్సీగానో పదవులు పొందారు. ఇక కేసీఆర్ సోదరుడు మేనల్లుడు సంతోష్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీగా ఉన్నారు. ఇలా అందరూ వాళ్లే. ఇదే పదేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమయిందన్న విశ్లేషణలు వినపడ్డాయి. అయినా అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఆ నలుగురే పార్టీని నడుపుతన్నారు. అంతకు మించి వేరే ప్రత్యామ్నాయం లేదు. ఎందుకంటే వందల కోట్ల రూపాయల నిధులున్న పార్టీ బాధ్యతలను వేరే వారికి అప్పగించే సాహసాన్ని గులాబీ బాస్ చేయరనే చెప్పాలి.ఇక తెలుగుదేశం పార్టీలో కూడా ఏపీలో ఫక్తు వారసత్వ రాజకీయాలను నడుపుతుంది. మొన్నటి ఎన్నికల్లో ఐదు టిక్కెట్లు ఆ కుటుంబానికే దక్కాయి. చంద్రబాబు, లోకేశ్, నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి పురంద్రీశ్వరి, శ్రీభరత్ లు టిక్కెట్లు పొంది చట్టసభలకు ఎన్నికయ్యారు. మంత్రి వర్గంలోనూ నారా కుటుంబం నుంచి ఇద్దరున్నారు. పార్టీ పదవులను కూడా వారిద్దరే చూసుకుంటున్నారు. దీంతో ఒక కుటుంబం చేతిలోనే పార్టీ ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అలాగే విపక్ష నేత వైసీపీ అధినేతజగన్ కూడా అదే తరహా రాజకీయాల నుంచి వచ్చారు. తండ్రి వైఎస్ వారసత్వరాజకీయాలను అందుకుని సొంత పార్టీ పెట్టుకున్నారు. వైఎస్ షర్మిల ఏపీ కాంగ్రెస్ చీఫ్ పనిచేస్తున్నారు. ఇక అధికారంలో ఉన్నప్పుడు జగన్ బంధువులు అనేక మంది టిక్కెట్లు పొందారు. పదవులు సాధించుకున్నారు. ఇలా ఈ రెండు పార్టీలూ వారసత్వ రాజకీయాలకు పెద్దపీట వేసినట్లే కనపడుతుంది. ఇక జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అయినా వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉంటారని భావిస్తే, ఆయన కూడా తనకుటుంబానికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న కామెంట్స్ పార్టీలో జోరుగా వినిపిస్తున్నాయి. నాదెండ్ల భాస్కర్ రావు వారసత్వాన్ని రాజకీయంగా ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ అందిపుచ్చుకున్నారు.

తాజాగా ఎమ్మెల్సీ పోస్టుకు నాగబాబు నామినేషన్ వేయడంతో కొణిదల కుటుంబంలో మూడో వ్యక్తి పదవి పొందేందుకు రెడీ అయినట్లే. పార్టీ కోసం కష్టపడ్డారన్న పేరు మీద నాగబాబును ఎంపిక చేయడంతో మరోసారి వారసత్వ రాజకీయాలు ఏపీలో హాట్ టాపిక్ గా మారాయి. చిరంజీవి ఇప్పటికే కేంద్ర మంత్రిగా పనిచేసి రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. మరికొద్ది రోజుల్లో నాగబాబు కూడా మంత్రి అయితే ఒకే కుటుంబం నుంచి కేబినెట్ లో ఇద్దరు ఉన్నట్లే అనుకోవాలి. వారసులకు తప్ప పోస్టుల ప్రాధాన్యత మరెవ్వరికీ లేదన్నది వాస్తవం.

# ప్రశ్నార్థకంగా మారిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు



నాగర్ కర్నూలు : దక్షిణ తెలంగాణాలో పాలమూరు, నల్గొండ జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు త్రాగునీరు అందించే బహుళార్థ సాధక ప్రాజెక్ట్ ఎస్ ఎల్ బి సి (శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం) భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పద్దెనిమిది రోజుల క్రితం టన్నెల్ కూలిన ప్రమాద ఘటనలో ఒక మృతదేహం వెలికి తీయగా మరో ఏడుగురి ఆచూకీ ఇప్పటికి లభించలేదు. కేంద్ర,రాష్ట ప్రభుత్వాలు సంయుక్తంగా అత్యాధునిక సాంకేతికత వినియోగించి రెస్క్యూ చర్యలు చేపట్టినప్పటికి ఆశించి న ఫలితం రావడం లేదు. ఈ దుర్గటన పై ప్రజలు, ప్రతి పక్షాలనుండి భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నాగర్కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ టన్నెల్లో ఇటీవల జరిగిన ప్రమాదం రాష్ట్రాన్ని తీవ్రగ్భ్రాంతికి గురి చేసింది. ఫిబ్రవరి 22, 2025న ఉదయం 8:30 గంటల సమయంలో టన్నెల్ పైకప్పు కూలిపోవడంతో ఎనిమిది మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. ఈ ఘటనపై ప్రభుత్వం, విపత్తు స్పందన బలగాలు, సైన్యం, సింగరేణి సంస్థలు తక్షణ చర్యలు చేపట్టాయి. సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయి. ప్రజలు, రాజకీయ నాయకులు ఈ ఘటనపై తమ స్పందనను భిన్నంగా వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సహాయక చర్యలను ప్రారంభించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రోడ్లు భవనాలు శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

టన్నెల్లో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసు కురావడానికి అన్ని విధాలా ప్రయత్నాలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుండి ఎన్డీఆర్ఎ ఫ్, నేవీ, జి పి ఆర్, సింగరేణి,స్పెషల్ డాగ్ స్కాడ్ ఇతర సాంకేతిక బృందాలను కేంద్రమంత్రి ఆదేశాలతో రప్పించారు. నిరంతర రెస్క్యూ ఆపరేషన్ కొనసాగు తున్నప్పటికి టన్నెల్ లో కురుకుపోయిన మట్టి,బురద,నీటిఊటలకారణంగా సహా యక చర్యలకు అడ్డంకి గా మారింది.

విపక్షాల స్పందన:

ప్రతిపక్ష పార్టీలు ఈ ఘటనపై ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. భారత రాష్ట్ర సమితి (ఃభీూ) నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, ప్రాజెక్టుల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై జ్యుడిషీయల్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఈ ఘటనపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల కుటుంబాలు వారి కుటుంబ సభ్యులను సురక్షితంగా తిరిగి తీసుకు వచ్చేందుకు ప్రార్థనలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రజలు సహాయక చర్యలను వేగవంతం చేయాలని,ప్రమాదానికి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇప్పుడున్న పరిస్థితి

ఎస్ ఎల్ బి సి టన్నెల్ ప్రమాద ఘటనలో ప్రస్తుతం సహాయక చర్యలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. టన్నెల్లో మట్టి, బురద, నీరు భారీగా చేరడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ర్యాట్ హోల్ మైనర్స్ బృందాలు సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు ప్రత్యేక వ్యూహాలతో పనిచేస్తున్నాయి. టన్నెల్ బోరింగ్ మిషన్ కూడా డామేజ్ అయ్యింది, ఇది సహాయక చర్యలను మరింత క్లిష్టతరం చేసింది. ఈ ప్రమాదం కారణంగా ప్రాజెక్టు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. ప్రాజెక్ట్ భవిష్యత్తు పై నీలి నీడలు కమ్ముకున్నాయి.

టన్నెల్లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులు వివిధ రాష్ట్రాలకు చెందినవారు. ప్రభుత్వం వారి సురక్షిత రక్షణకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే జిపియర్, డాగ్ స్కాడ్, ర్యాట్ మాన్ హోలర్స్, సింగరేణి, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాల సహాయంతో ఒక మృత దేహాన్ని వెలికి తీశారు. మిగిలిన వారి ఆచూకీ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. టన్నెల్ లో కన్వేయర్ బెల్ట్ తెగిపోవడం,నీరు, మట్టి, బురద చేరడం సహాయక చర్యలకు ప్రధాన ఆటంకాలుగా నిలిచాయి.

ఈ ప్రమాదం రాష్ట్రంలోని ప్రాజెక్ట్ ల భద్రతా ప్రమాణాలపై చర్చను రేకెత్తించింది. ప్రభుత్వం, రెస్క్యూ బృందాలు, సైన్యం, సింగరేణి సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. కానీ ఆశించిన ఫలితం మాత్రం దక్కలేదు.

# అండర్ గ్రౌండ్ టన్నెల్ సాధ్యమా?

మహబూబ్ నగర్ : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రోడ్లు ఉంటే అభివృద్ధి జరుగుతుందన్న ఉద్దేశంతో రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చిస్తోంది. ఇప్పటికే వేల కిలోమీటర్ల నిర్మాణం జరిగింది. తాజాగా తెలంగాణలో భూగర్భ మార్గం నిర్మాణంపై దృష్టి పెట్టింది.నుంచి శ్రీశైలం వరకు ప్రస్తుతం ఉన్న రహదారి సుమారు 213 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ మార్గంలో ప్రయాణ సమయం సాధారణంగా 5 నుంచి 6 గంటలు పడుతుంది. ఈ రహదారి నల్లమల్ల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ గుండా వెళుతుంది, ఇక్కడ రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రాకపోకలు నిషేధించబడతాయి. ఈ పరిమితులు, రహదారి పరిస్థితులు. భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఈ మార్గాన్ని మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలను పరిశీలిస్తోంది.మార్గంలో ఒక భూగర్భ మార్గం నిర్మించే ఆలోచన గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. అయితే, ఈ ఆలోచన వెనుక ఉన్న కొన్ని సాధ్యమైన కారణాలు ఇలా ఉన్నాయి.: భూగర్భ మార్గం ద్వారా దూరం మరియు సమయం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత 5?6 గంటల ప్రయాణం 3?4 గంటలకు తగ్గే అవకాశం ఉంది.నల్లమల్ల అడవుల్లో వన్యప్రాణులు, రాత్రి పూట రాకపోకల నిషేధం వంటి సమస్యలను నివారించవచ్చు.పర్యాటకం, కనెక్టివిటీ: శ్రీశైలం ఒక ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో, ఈ మార్గం ద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.: అడవుల గుండా రహదారులు విస్తరించడం కంటే భూగర్భ మార్గం పర్యావరణానికి తక్కువ హాని కలిగించవచ్చు.

భూగర్భ మార్గంతోపాటు, హైదరాబాద్?శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం గురించి కూడా చర్చలు జరుగుతున్నాయి. ఈ ఎలివేటెడ్ కారిడార్ 62 కిలోమీటర్ల పొడవుంటుందని, దీని నిర్మాణ వ్యయం సుమారు రూ. 7,700 కోట్లుగా అంచనా వేయబడింది. ఈ ప్రాజెక్ట్‌లో ఒక ఐకానిక్ బ్రిడ్జ్ కూడా భాగంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ రెండు ప్రతిపాదనలు (భూగర్భ మార్గం మరియు ఎలివేటెడ్ కారిడార్) ఒకదానికొకటి పూరకంగా లేదా ప్రత్యామ్నాయంగా పరిగణించబడుతున్నాయా అనేది ఇంకా స్పష్టంగా తెలియలేదు.భూగర్భ మార్గం నిర్మాణం అనేది సాంకేతికంగా సవాలుతో కూడుకున్నది. నల్లమల్ల కొండలు, భౌగోళిక పరిస్థితులు దీన్ని సంక్లిష్టంగా మార్చవచ్చు.ఎలివేటెడ్ కారిడార్‌కే రూ. 7,700 కోట్లు అంచనా వేస్తుంటే, భూగర్భ మార్గం ఖర్చు ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇటువంటి పెద్ద ప్రాజెక్టులకు సంవత్సరాల సమయం, పర్యావరణ అనుమతులు, భూసేకరణ వంటివి అవసరం. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు భూగర్భ మార్గం ఒక సాహసోపేతమైన ఆలోచనగా ఉన్నప్పటికీ, ఇది ఇంకా ప్రణాళిక దశలోనే ఉంది. ప్రస్తుతానికి, ఈ మార్గంలో ప్రయాణం కోసం జాతీయ రహదారి 765 రహదారి మాత్రమే అందుబాటులో ఉంది.

# అడ్డగోలుగా ఎర్రమట్టి తవ్వకాలు





వరంగల్ : ఊరికి చెరువులు ఎంతో ఉపయోగకరమని భావించిన పెద్దల ఆశయాలకు భంగం కలిగించే రీతిలో చెరువులలోని మట్టి, ఎర్రమట్టి, మొరం దందా కొనసాగుతోంది. చెరువులలో మట్టి పూడిక తీయడానికి జిల్లా అధికార యంత్రాంగం నుంచి అనుమతులు తీసుకొని, మార్గదర్శకాల మేరకు మాత్రమే మట్టి తవ్వకాలు చేపట్టాలని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని స్థానికంగా ఉన్న సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పల్లె ప్రజానీకానికి తీరని శాపంగా మారుతుంది.సమాజానికి విఘాతం కలిగించే సందర్భం ఏదైనప్పటికీ, కట్టడి చేయాల్సిన పోలీస్ యంత్రాంగం, పంచాయతీరాజ్ శాఖలు కల్లుండి కబోది లాగా వ్యవహరిస్తున్నాయని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం లో నిత్యం మట్టి, ఎర్ర, మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా నిరాటకంగా సాగుతుంది.తాజాగా మండలంలోని ఆదివారం పేట గ్రామపంచాయతీ కి చెందిన ఎర్ర చెరువులో మట్టి, ఎర్రమట్టి, మొరం తవ్వకాలను చేపడుతున్నారు. మండలంలోని ధన్వాడ జాధరావు పేట రోడ్డు పనులు చేస్తున్న పీడీఆర్ సంస్థ ఈ చెరువు నుండి మట్టి తరలిస్తోంది. ఉదయం సాయం సంధ్య వేళలో గత నెల రోజుల నుండి ఇష్టారీతిన మట్టి తరలింపు జరుగుతోందని గ్రామస్తులు తెలిపారు.రహదారుల నిర్మాణానికి ఇరు ప్రక్కల సైడ్ బర్మలను ఏర్పాటు చేయడానికి మట్టి అవసరం ఏర్పడుతుండగా, సదరు కాంట్రాక్టర్లు అందుబాటులో గల అడవుల్లో లేదా చెరువుల్లో మట్టిని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువుల్లోని మట్టిని తవ్వడానికి ముందస్తు అనుమతులు తప్పనిసరి.చెరువు పరిస్థితుల నేపథ్యంలో పూడిక మట్టి లాగా తీయడానికి మాత్రమే అవకాశాలు ఉండగా, అందుకు విరుద్ధంగా జెసిబి ప్రోక్లైన్ల ద్వారా గోతుల మాదిరిగా తవ్వుతూ, భారీ టిప్పర్ల ద్వారా మట్టి తరలింపు జరుగుతోంది. చెరువులో మట్టి తీయడానికి మూడు నాలుగు ఫీట్ల లోతుతో సమాంతరంగా మట్టి తవ్వకాలు చేపట్టాలని మార్గదర్శకాలు పేర్కొంటుండగా, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన పంచాయతీ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు పత్తా లేకుండా పోవడంతో మోరం దందా నిర్వాహకులకు ఆడింది ఆట.. పాడింది పాటగా సాగుతోంది.కాంట్రాక్టర్లు మట్టి తవ్వకాలు చేపడితే ప్రభుత్వానికి రాయల్టీ రూపేనా పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ పట్టనట్లుగా అడ్డు అదుపు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు కాంట్రాక్టర్లు సైతం మట్టి తరలింపు యదేచ్ఛగా కొనసాగుతోంది. ప్రజా అవసరాలకు భిన్నంగా కొనసాగుతున్న కార్యకలాపాలను అదుపు చేయాల్సిన పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తూ మిన్నకుండి పోతుందా అని పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.చెరువులలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడం వల్ల వర్షాకాలంలోని నీరు గుంతలలో నిలువ ఉండి, చెరువు కింది ఆయకట్టుకు ప్రయోజనం లేకుండా పోతుందని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూము మత్తడి ద్వారా నీటి సరఫరా కావాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ చెరువులలో ఏర్పడిన నూతుల మాదిరిగా తలపిస్తున్న గోతుల వల్ల రాబోయే రోజుల్లో నీటి నిల్వలు ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి.నీటి గుంతలలో పడి చిన్నారులు, చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన జాలర్లు, పశువులు ప్రమాదాలు ఎదుర్కొన్న సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం సంబంధిత శాఖలు చెరువులలో మట్టి, ఎర్ర మట్టి, మొరం దందాలను నిలువరించాలని ప్రజలు కోరుతున్నారు.చెరువులలో మట్టి తవ్వకాలవల్ల మున్ముందు ప్రమాదాలుసంభవించకుండా,భవిష్యత్తు ప్రణాళికల ను రూపొందించాలని,అందుకు అనుగుణంగా నిరంతరంసదరు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి, ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# మళ్లీ బంగారం జంప్

హైదరాబాద్ : డాలర్ వీక్‌గా మారడంతో పాటు పసిడిపైపు పెట్టుబడులు పరుగులు పెడుతుండే సరికి గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్ రేటు కాస్త పెరిగింది. ప్రస్తుతం, అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 2,918 డాలర్ల దగ్గర ఉంది. ఈ రోజు మన దేశంలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 కేరెట్లు) ధర 110 రూపాయలు, ఆర్నమెంట్ గోల్డ్ (22 కేరెట్లు) ధర 100 రూపాయలు, 18 కేరెట్ల బంగారం రేటు 90 రూపాయల చొప్పున పెరిగాయి. ఈ లెక్కన, 100 గ్రాముల ప్యూర్ గోల్డ్ (24ఐ) ధర ఈ రోజు రూ. 1100 జంప్ చేసింది. కిలో వెండి రేటు 100 రూపాయలు తగ్గింది. హైదరాబాద్‌మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 87,820 వద్దకు; 22 క్యారెట్ల బంగారం ధర రూ. 80,500 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర రూ. 65,870 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లోరూ. 1,08,000 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది. విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 87,820 వద్దకు; 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర రూ. 80,500 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర రూ. 65,870 వద్దకు చేరింది.ఇక్కడ కిలో వెండి ధర రూ. 1,08,000 గా ఉంది. విశాఖపట్నంమార్కెట్‌లో బంగారం,వెండికి విజయవాడ రేటే అమలవుతోంది.

# 60 ఏళ్లు దాటిన వృద్ధులు, 18 ఏళ్ల లోపు బాలికలతో సంఘాలు

హైదరాబాద్ : సమాజంలోని అన్ని వర్గాలతో విజయాన్ని పంచుకోవాలనే స్పష్టమైన సందేశంతో ఇందిరా మహిళా శక్తి మిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల్లో 18 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న వాళ్లే చరగలరు. ఇప్పుడు 15-18 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలను, వృద్ధ మహిళలను కూడా స్వయం సహాయక సంఘాల పరిధిలోకి తీసుకురానున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇందిరా మహిళా శక్తి మిషన్ పేరుతో ఈ డాక్యుమెంట్ విడుదల చేసింది. భవిష్యత్‌లో చేపట్టబోయే పనులకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేసింది. మహిళల కోసం ఏం చేయబోతోంది. ఏం చేసింది. వారి ఉపాధి కోసం చేపట్టబోయే పనులను అన్నింటినీ వివరించింది. 15 నుండి 18 సంవత్సరాల వయస్సు బాలికలు తెలంగాణలో లక్షల మంది ఉన్నారు. చాలా కీలకమైన ఈ దశలోని వారు వృద్ధిలోకి రావడానికి చేయూత ఇస్తామంటోంది ప్రభుత్వం. మంచి నిర్ణయాలు తీసుకునే దిశగా, మంచి వాతావరణం సృష్టించడం చాలా ముఖ్యం. అభివృద్ధి ప్రక్రియలో వారిని క్రియాశీల భాగస్వాములుగా చేయడం అవసరం. ఆరోగ్యం, పోషకాహారం, విద్య, ఉపాధి కోసం కొత్త, వినూత్న కార్యక్రమాలును రూపొందించాలని చూస్తోంది. వారిని సమగ్రంగా, సమన్వయ పద్ధతిలో శిక్షణ ఇస్తే సాధికారత సాధిస్తారని భావిస్తోంది. స్వయం సమృద్ధి సాధిస్తారని తెలుపుతోంది. అందుకే వారిని మహిళా స్వయం సహాయక సంఘాల్లో భాగం చేస్తామని ప్రభుత్వం తెలిపింది. జఔఎఅఇఈ భాగస్వామ్యంతో, తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లాల్లో 15-18 సంవత్సరాల వయస్సు బాలికల సంఘాలు ఏర్పాటు చేస్తుంది. మంచి ఆరోగ్యం, పోషకాహారం, ఆర్థిక పరిజ్ఞానం, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇచ్చి సాధికారత కల్పించనుంది. యుక్తవయస్సులోకి వచ్చే సరికి సాధికారికత సాధిస్తారని పేర్కొంది. వయసు పెరగడం, మారుతున్న కుటుంబ పరిస్థితులతో చాలా మంది వృద్ధులను ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ఒంటరిగా ఉంటూ ఆరోగ్య సంరక్షణ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వాళ్లకు వృద్ధుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది ప్రభుత్వం. వీటి ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం, సామాజిక మద్దతు, తోటి వారి సహాయం లభిస్తుందని చెబుతోంది. వృద్ధుల స్వయం సహాయక సంఘాలు పొదుపు చేయడానికి, రుణాలను పొందడానికి, నైపుణ్యాలను పంచుకోవడానికి ఉపయోగపడ తాయి. సీనియర్ సిటిజన్‌లకు గౌరవం, స్వావలంబన, అభివృద్ధిలో భాగస్వామ్యం లభించనుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయనుంది. తద్వార సభ్యులు సంతృప్తికరమైన జీవితాలు గడపడానికి వీలు కలుగుతుంది. తెలంగాణలో 15 లక్షల మంది వృద్ధులు వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారు. 7-8 లక్షల మంది సీనియర్ మహిళలు వృద్ధుల స్వయం సహాయక సంఘాల్లో చేరడానికి అవకాశం ఉంది. వృద్ధుల మహిళా సంఘాలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంచడానికి హస్తకళలు, వ్యవసాయం, చిన్న వ్యాపారాలతో ప్రోత్సహించనున్నారు.

# విద్యార్థులకు గుడ్ టచ్ బాడ్ టచ్ సైబర్ నేరాల గురించి అవగాహన

కోహెడ : జిల్లా పరిషత్ హై స్కూల్ శనిగరం విద్యార్థులకు గుడ్ టచ్ బాడ్ టచ్ సైబర్ నేరాల గురించి కోహెడ ఎస్ఐ అభిలాష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అభిలాష్ మాట్లాడుతూ అందరు కలిసిమెలిసి ఉండాలని ఒకరికొకరు చదువులో సహాయం చేసుకుంటూ ఒక లక్ష్యం, గోల్ ఏర్పాటు చేసుకుని దాని కనుగుణంగా కష్టపడి చదువుకోవాలని అన్నారు. ఎవరు కూడా బాల్య వివాహాలు చేసుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బాల్య వివాహాలు, మానవ అక్రమా రవాణా గురించి సమాచారం ఉంటె మాకు తెలియ జేయాలని సూచించారు. సెల్ ఫోన్స్ అవసరం మేరకు ఉపయోగించాలని, ఎవరు కూడా సైబర్ నేరాలకు గురికావద్దు అని, తెలియని వ్యక్తులు నుండీ వచ్చే మెసేజ్ లకు రెస్పాండ్ కావద్దని, బ్యాంక్ అధికారులము అంటు ఎవరైన ఫోన్ చేసి అకౌంట్ వివరాలూ అడిగితే చెప్పవద్దు విద్యార్థులను ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీటీమ్ నెంబర్ 8712667434 కాల్ చేయాలని సూచించారు. మహిళల రక్షణకు ఎల్లప్పుడు షీటీమ్ అండగా ఉంటుందని తెలిపారు.

అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని ఈ వయసులో ప్రేమ పెళ్లి అంటూ చెప్పే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదువుకోవాలని మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని చదువు ఉంటే ఎక్కడైనా బతుకుచ్చని తెలిపారు. ఇష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

# కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికై అధిక నిధులు కేటాయించాలి

### కర్నూలు జిల్లాకు రాష్ట్ర బడ్జెట్లో అరకొర నిధులు కేటాయింపు పై నిరసన

### జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి : సిపిఐ డిమాండ్

దేవనకొండ: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కర్నూలు జిల్లాకు కేటాయించిన అరకొర నిధుల కేటాయింపు వల్ల జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎమ్.నరసరావు ఆరోపించారు. సోమవారం సిపిఐ జిల్లా సమితి పిలుపులో భాగంగా దేవనకొండ తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ మండల నాయకులు బి.యెస్.అబ్బాస్ అధ్యక్షతన నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తయిందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశాల్లో 2025..26 సంవత్సరానికి ఆర్థిక శాఖ మంత్రి గారు ప్రవేశపెట్టిన బడ్జెట్లో కర్నూలు జిల్లాకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్ ప్రాజెక్టుకు, గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తిచేసి కరువు, వలసలు నివారిస్తామని హమీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం బడ్జెట్లో నిధులు కేటాయింపులు చేస్తారని జిల్లా ప్రజలు ఆశించారని పేర్కొన్నారు.సాగునీటి ప్రాజెక్టులకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా నిధులు కేటాయించకుండా ఇచ్చిన హామిలను పూర్తిగా విస్మరించారని అన్నారు.జిల్లాలో పశ్చిమ ప్రాంతం పూర్తిగా కరువు కాటకాలకు నిలయంగా మారి సాగునీరు,త్రాగునీరు దొరకక ప్రజలు అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల్లో సోషల్ ఎకనామిక్ సర్వే తెలిపిన నివేదికలో రాష్ట్రంలోనే అత్యధికంగా పేదరికం ఉన్న జిల్లాగా కర్నూలు జిల్లా నమోదు కావడం చాలా ప్రమాదకరంగా ఉందన్నారు.ఇటువంటి ప్రత్యేక పరిస్థితుల్లో కర్నూలు జిల్లా అభివృద్ధికి,సాగునీటి ప్రాజెక్టులు వేదవతి,ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్, ఎల్ ఎల్ సి, హెచ్ ఎల్ సి కాలువలకు , జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నూతన పరిశ్రమల ఏర్పాటుకు అధిక నిధులు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరంఉందన్నారు. పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తే లక్షలాది ఎకరాలకు సాగునీరు ప్రజలకు త్రాగు నీరు లభిస్తుందన్నారు. బడ్జెట్లో సాగునీటి ప్రాజెక్టులకు జిల్లా సమగ్ర అభివృద్ధికి 10 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, ఎల్.ఎల్.సి కి కేవలం 30 కోట్లు విదిల్చి చేతులు దులుపుకోవడం చాలా అన్యాయమన్నారు. కే.సీ. కెనాల్ ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు, కర్నూలు నగరానికి త్రాగునీరు అందించాల్సిన గుండ్రేవుల రిజర్వాయర్ కు బడ్జెట్లో గుండు సున్న చుట్టారని తెలిపారు.దీని కారణంగా రాబోయే కాలంలో జిల్లా మరింత వెనుకబాటుకు గురవుతుందన్నారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలలో సవరణలు చేసి జిల్లా అభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి, నూతన పరిశ్రమలు ఏర్పాటుకు నిధులు కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కృష్ణ, మండల నాయకులు వీరాంజనేయులు, మహబూబ్ బాషా, కోదండ, శంకర్, రహమతుల్లా, శేఖర్, విజయ్, రామాంజనేయులు, దస్తగిరి, భాస్కర్, వీరేష్, కోదండ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

# రిలయన్స్ సంస్థకు 2600 ఎకరాలు అవసరమా

### పరిశ్రమలకు కేటాయించిన భూములు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటం బాధాకరం

### అసెంబ్లీలో సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

తాడేపల్లి : ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వద్ద పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం 2008లో 2600 ఎకరాల భూమిని రిలయన్స్ సంస్థకు అప్పగించారు. 2008 నుంచి ఆ భూములు ఖాళీగానే ఉన్నాయి. ఎకరాకు రూ.30 వేలు లెక్కన వేసుకున్నా ఏడాదికి రూ.9 కోట్లు ఆదాయం పోయిందని సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఇండస్ట్రీయల్ పాలసీ ప్రకారం భూములు కేటాయించిన తర్వాత రెండేళ్లలో పరిశ్రమ కార్యకలాపాలు ప్రారంభం కావాలి. రెండేళ్లు కాకపోయినా నాలుగేళ్లకైనా ప్రారంభించవచ్చు.అలా కాకుండా ఏళ్ల తరబడి భూములను బీడుగా పెట్టి రైతులు, రైతు కూలీలను పనులు లేకుండా పస్తులు పెట్టడం దురదృష్టకరం. అప్పట్లో ఎకరాకు రూ.3 లక్షల పరిహారం ఇస్తామంటే మేం ఒప్పుకోలేదు..నేను ఓడిపోయి ప్రతిపక్షంలో ఉన్నా రైతులకు అండగా నిలిచి ఎకరాకు రూ.7 లక్షల నుంచి రూ.7.70 లక్షలు ఇప్పించామని అన్నారు. అప్పట్లో రూ.7 లక్షలకు శంషాబాద్ ప్రాంతంలో వస్తుందని ఆయా కంపెనీల ప్రతినిధులు అభ్యంతరం తెలిపినా మేం రాజీపడలేదు పోరాటం సాగించి ఆ రోజుల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించాం. 2029 నాటికి రూ.20 వేల కోట్లతో రెండు యూనిట్లు పెడతామని ఇప్పుడు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చిదంటున్నారు. ఒక్కో యూనిట్ లో 800 నుంచి 1000 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయంటున్నారు. ఆ ఉద్యోగాలను కూడా స్థానికులకే ఇవ్వాలని కోరుతున్నాను. నైపుణ్యం కలిగిన వారు మన ప్రాంతంలోనే ఎందరో ఉన్నారు. 2600 ఎకరాల భూమి అంతా తమకు అవసరమని రిలయన్స్ సంస్థ చెబుతోంది. ఆ కంపెనీ పెట్టే పరిశ్రమలకు అంత భూమి అవసరం ఉందా..అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలి. మిగిలిన భూములను ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసి ఇతర పరిశ్రమలకు అప్పగించాలని అన్నారు. రిలయన్స్ సంస్థకు కేటాయించిన భూములే కాదు..జిల్లాలో ఇంకా వేలాది ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయి. పీవి నరసింహరావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పెన్నార్ డెల్టాలోని 2700 ఎకరాలతో రాచర్లపాడు వద్ద కిసాన్ సెజ్ ఏర్పాటు చేశారు. కృష్ణపట్నం సెజ్ లో 7 వేల ఎకరాలు, మేనకూరు సెజ్ లోనూ ఇంకా భూములు ఖాళీగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక 10 ఎకరాల నుంచి 1000 ఎకరాల వరకు ఎంత భూమి ఉన్నా సేకరించి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం శుభపరిణామం. ఇప్పటికే ఖాళీగా ఉన్న వేలాది ఎకరాల భూములను ఉపయోగంలోకి తీసుకొచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని అన్నారు.



## ‘బాలవికాస’ వాటర్ ప్లాంట్ పున:ప్రారంభం

**వేద న్యూస్, ఎల్కతుర్తి :**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ బాలవికాస వాటర్ ప్లాంట్ రిపేర్‌కు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపారు. వాటర్ ప్లాంట్ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయగా, దానిని బుధవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. కాగా, వేసవికాలం దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు రాకుండా సమస్య పరిష్కారానికి మంత్రి నిధులు కేటాయించినందుకు చింతలపల్లి గ్రామస్తులు మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. వాటర్ ప్లాంట్ పున:ప్రారంభ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు సుకినె సంతాజీ, నాయకులు అడ్డూరి కొమురయ్య, కుడుతాడి రాజు, ఎనకమూరి చందర్ రావు, హింగె సంతాజీ, శ్రీకాంత్, సోమాజీ, రవీందర్, రజిత తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ లబ్ధి కోసమే ధర్నా

**వేద న్యూస్, శాయంపేట :**

చలి వాగు ప్రాజెక్టు ప్రాంత రైతులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని ఉద్దేశంతో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ధర్నా చేపట్టాడని శాయంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి అన్నారు. హన్మకొండ జిల్లా శాయంపేట మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలివాగు ప్రాజెక్టులో నీటి లెవెల్స్ పడిపోకుండా పలుమార్లు ప్రాజెక్టును సందర్శించామని సాగు చేసే ప్రతి ఎకరాకు ప్రాజెక్టు ద్వారా నీటిని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక చొరవ తీసుకొని ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేస్తూ రైతులకు సాగునీరు అందిస్తున్నారని వారు అన్నారు. అనవసరపు రాద్ధాంతం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని దురుద్దేశంతో గండ్ర వెంకటరమణారెడ్డి ధర్నాల పేరుతో రైతులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశం లో నాయకులు బాసాని రవి, బాసాని మార్కండేయ, వలిహైదర్, తిరుపతి రెడ్డి, కృష్ణమూర్తి, రేణుకుంట్ల సదయ్య, కట్టయ్య, రాజు, సుదర్శన్, వలపదాసి రాము తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి

**వేద న్యూస్, మెట్ పల్లి :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వెంపేట శివారులో గత నెల ఫిబ్రవరి 25న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన లింగంపల్లి వెంకన్న(60) చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకన్న ఫిబ్రవరి 25న మెట్ పల్లి నుండి ముత్యంపేటకు వెళ్తుండగా మల్లాపూర్ వైపు నుంచి వస్తున్న ఏపీ 29 జెడ్ 2276 గల ఆర్టీసీ బస్సు వెంపేట శివారులో వెంకన్న ద్విచక్ర వాహనానికి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఆయన మరణించారు. మృతుని కుమారుడు అంజయ్య ప్రమాదానికి కారకుడైన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ పై ఫిర్యాదు చేశారు. కాగా శవ పంచనామా జరిపి మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పాజెప్పినట్లు మెట్ పల్లి సీఐ ఎ.నిరంజన్ రెడ్డి తెలిపారు.



## ఘనంగా గంటా రమేష్ జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ప్రముఖ కూరగాయల వ్యాపారి గంటా రమేష్ జన్మదిన పురస్కరించుకొని బుధవారం నగరంలోని కూరగాయల మార్కెట్లో వ్యాపారస్తులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అనాధ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ప్రతినిధి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కూరల మార్కెట్ వ్యాపారస్తులు, రవి, రాజు, మురళి, చంద్రమౌళి,రమేష్,సంపత్ కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన కబడ్డీ క్రీడలు

- జాతర క్రీడలను ప్రారంభించిన సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో కాకతీయ కాలం నుండి ప్రసిద్ధిగాంచిన శ్రీ రామలింగేశ్వర జాతర కబడ్డీ, ఎడ్ల పందాల క్రీడలను బుధవారం దేవాలయ చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లతో కలిసి సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ ప్రారంభించారు. అంతకుముందు శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో అర్చకులు రెంటాల సతీష్ శర్మ,మణిశర్మ ఆధ్వర్యంలో అర్చనలు,అభిషేకాలు చైర్మన్ తాళ్ల వెంకటేశ్వర్లతో కలిసి సబ్ కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కబడ్డీ క్రీడలలో పాల్గొని కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఫ్రెండ్లీ క్రీడలు నిర్వహించుకోవాలని కోరారు. జాతర భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు బాగున్నాయన్నారు. ఈ దేవాలయం కోరుకుంటే వరాలు ఇచ్చే దేవాలయంగా నిలిచిందన్నారు. అనంతరం దేవాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. శ్రీ రామలింగేశ్వర దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి తాసిల్దార్ పుష్పలత, మాడుగులపల్లి తహసిల్దార్ సురేష్, సిఐ పి అండి ప్రసాద్, ఎస్సై డి వెంకటేశ్వర్లు, దేవాలయ ఈవో మృత్యుంజయ శాస్త్రి, దేవాలయ ధర్మకర్తలు వాకిడి భిక్షం, పెరుమాండ్ల జోజి, ముత్యాల యుగంధర్, లోండ కలమ్మ ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బంటు చొక్కాయ్య గౌడ్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, వల్లంపట్ల ప్రవీణ్, కోల సైదులు, ఎలికట్టి భరత్ కుమార్,పిల్లల సందీప్ నాయుడు, మిర్యాల బిక్షమయ్య,వల్లంపట్ల అబ్రహం, కోల మల్లయ్య,చింతకాయల వీరేందర్, సబ్బు లింగారెడ్డి,నార్ల అజయ్,మేక మాణిక్యం, మెరుగు జానీ, పెరుమాండ్ల రమేష్,భయ్యా సైదులు, పేర్ల శంకర్, గంట కృష్ణయ్య,పెరుమాండ్ల నగేష్,ముండ్ల గంగయ్య, బచ్చు జానయ్య,మేక జయరాజు, మున్న గోపాల్, సలి కొలిమిలా,బిక్షమాచారి, శంకర్, బచ్చు వెంకన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# యువ ఉత్సవ్ కార్యక్రమం యువత ప్రతిభకు తార్కాణం

**వేద న్యూస్, వరంగల్ :**



గ్రేటర్ వరంగల్ బొల్లికుంట వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం వరంగల్ వారి ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ -2025 జిల్లాస్థాయి యువజనోత్సవ కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రతిభా పాటవ పోటీలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముస్తాక్ అలీ నేతృత్వం వహించి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రదర్శించడానికి ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ యువ ఉత్సవ్ కార్యక్రమం యువత ప్రతిభకు తార్కాణంగా నిలుస్తున్నదనీ అన్నారు. నృత్యం, కవితారచన,వక్తృత్వ పోటీలు మొదలయిన ప్రతిభా పాటవ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నందుకు వారందరినీ అభినందిస్తున్నాననీ అన్నారు. అనంతరం గౌరవ అతిథులుగా పాల్గొన్న సత్యం కంప్యూటర్ చైర్మన్ గంట రవికుమార్, ఫిలిం సెన్సార్ బోర్డు డైరెక్టర్ ఆకుల నాగేశ్వర్, స్థానిక మామునూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఒరుగంటి రమేష్, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్,కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించి యువతను చైతన్య పరిచారు. యువజనోత్సవాలలో భాగంగా జిల్లాలోని యువతీ యువకులకు యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్, ఫోటోగ్రఫీ, ఉపన్యాసం, జానపద నృత్యం(గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ (గ్రూప్ మరియు వ్యక్తిగత) మొదలైన పోటీలు నిర్వహించి అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ,తృతీయ నగదు బహుమతి తోపాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల అధ్యాపక బృందం గద్దె రమేష్ , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మొహమ్మద్ ఆజం, శ్వేత,వాలంటీర్లు ఎర్రగోళ్ళ భరత్, సాయి, శ్రావణి,శివాజీ, శ్రావణ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# కూలీలకు మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు

- పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశం

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్నటువంటి ఉపాధి హామీ పనులను కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కనీసంగా 80 మంది కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పని కల్పించాలన్నారు. ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రదేశాలలో నీడ సౌకర్యం ఉండేలా చూడాలని అన్నారు. మంచినీటి సౌకర్యం కల్పించాలని, అలాగే కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా పని జరిగే ప్రదేశంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు 300 రూపాయల కూలీ పడేవిధంగా ఉపాధి హామీ సిబ్బంది మార్కౌట్ ఇచ్చి వారితో రోజుకు కనీసం 6 నుంచి 7 గంటలు పని చేపించి వారు చేసిన పనికి కొలతల ప్రకారం చెల్లింపులు చేయాలని సూచించారు. ఈ సందర్శన కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర సరుకులు పంపిణీ

**వేద న్యూస్, వరంగల్ :**




గ్లోబల్ హెూప్ చాలెంజ్ సేవలు అభినందనీయమని హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖ అధికారి (డిడబ్ల్యుఓ) జయంతి అన్నారు. గ్లోబల్ హెూప్ చాలెంజ్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 20 మంది వికలాంగులు, వితంతువులు, అనాధలకు, నెలకు సరిపడా నిత్యవసర సరుకులను దేవుని సంఘం జనరల్ పాస్టర్ కిమ్ జ్యోచ్యోల్ తో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ.. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి జీవనం గడవనటువంటి నిరాశ్రాయులకు చేయూతనందించడానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ఎల్లవేళలా వారికి అండగా ఉంటారు అని పేర్కొన్నారు. వాతావరణం సంక్షోభాలు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి నిరంతరం సేవలు చేస్తున్న గ్లోబల్ హెూప్ ఛాలెంజ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ డి కళ్యాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజమా సిగ్గుపడు..!

**మొదటి పేజీ తరువాయి**

పెట్టుకుంది. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఉపాధ్యాయురాలు.. వారి సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్ది నెలల కిందట మద్యం మత్తులో తండ్రి తనపై లైంగిక దాడి చేశాడని వెల్లడించింది. అప్పటి నుంచి తరచూ అఘాయిత్యానికి పాల్పడుతున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాలిక పేర్కొంది. దీంతో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలుపగా, నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. బయటవాళ్లు ఏమైనా అంటే మా నాన్నకు చెబుతా అని పిల్లలు బెదిరిస్తూ ఉంటారు. కానీ తండ్రే తనపై అఘాయిత్యానికి పాల్పడుతుంటే ఆ ఆడ బిడ్డ బయటకు చెప్పుకోలేకపోవడం చూసి పలువురు కన్నీరు కార్చారు. నిందితుని కఠినంగా శిక్షించాలని పలువురు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.

## బడ్జెట్లో బీసీలకు నిధులు కేటాయించాలి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీల అభివృద్ధి కోసం బీసీ సబ్ ప్లాన్ ప్రవేశపెడతామని,బీసీల సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరం 20 వేల కోట్ల నిధులు కేటాయిస్తామని అధికారంలోకి రాకమందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో స్పష్టంగా ప్రకటించి,ఇప్పుడు వెనకడుగు వేస్తుందని కామారెడ్డి డిక్లరేషన్ కట్టుబడి ఉండాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల జనాభా లెక్కలు రాష్ట్ర ప్రభుత్వమే 56శాతం ఉన్నారని అధికారికంగా తేల్చిన దరిమిలా బీసీ జనాభా ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,ఎర్రబెల్లి దుర్గయ్య, కుమ్మరికుంట్ల సుధాకర్,దోనేటి శేఖర్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

**వేద న్యూస్, గాంధారి :**

నూతన పదవి బాధ్యతలు చేపట్టిన కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో ని పోలీస్ స్టేషన్ ను బుధవారం ఉదయం ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వర త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు, సదాశివ నగర్ సిఐ సంతోష్ పాల్గొనడం జరిగింది.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073